క్లుప్తంగా

అధ్వానంగా యాటకల్లు రోడ్డు



గుంతలమయంగా మారిన యాటకల్లు - ఖైరుప్పల రోడ్డు

ఆస్పరి: మండలంలోని ఆస్పరి నుంచి చొక్కనహళ్లి, ఐనకల్లు, యాటకల్లు మీదుగా ఖైరుప్పల గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు పడ్డా అధికారులు మరమ్మతు పనులు చేపట్టలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో మండల కేంద్రమైన ఆస్పరికి రావాలంటే ఖైరుప్పల, కలపరి, తొగలుగల్లు, దొడగొండ, యాటకల్లు, ఐనకల్లు, చొక్కానహళ్లి గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

కుళాయిలకు నీరు సరఫరా చేయండి

మద్దికెర : డిపాజిట్లు చెల్లించి కుళాయిలు వేయించుకున్నామని, అయితే పంచాయతీ వారు ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇచ్చినప్పటి నుంచి నీరు రావడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రామస్వామి గుడి కాలనీకి చెందిన మహిళలు మంగళవారం పంచాయతీ అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. గతంలో కుళాయిలకు నీరు బాగా వచ్చేవన్నారు. అధికారులు పైపులైను వేసి నీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ విషయాన్ని సర్పంచ్, మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఉప సర్పంచ్ ప్రమీలమ్మ తెలిపారు.

బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు

పత్తికొండ రూరల్: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని పత్తికొండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం భ్రమరాంబ అన్నారు. పాఠశాలల్లో ప్రవేశాల సందర్భంగా మంగళవారం 'పదండి వెళ్దాం బడికి' అంటూ పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ చేశారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలన్నారు. విద్యార్థులు చదువుకునేలా తల్లిదండ్రులు పోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు రుక్మిణి, సునిత, చాముండేశ్వరి, పెద్దరంగమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామ సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర కళాశాల, పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతిలో ఎస్సీలకు 8, బీసీలకు 1, ఎస్టీలకు 1, 9వ తరగతిలో ఎస్సీలకు 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 29 లేదా 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు.

సెల్ఫీ వీడియో కలకలం



సెల్ఫీ వీడియోలో రోదిస్తున్న మద్దిలేటి

దేవనకొండ: మండలంలోని పల్లెదొడ్డి గ్రామానికి చెందిన మద్దిలేటి మంగళవారం కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంటానని చెబుతూ సెల్ఫీ వీడియోను కుటుంబ సభ్యులకు పంపించాడు. అన్నదమ్ముల మధ్య గత నాలుగేళ్ల నుంచి ఆస్తి తగాదాలు జరుగుతున్నాయని, గ్రామంలోని పెద్ద మనుషుల వద్ద ఎన్నిసార్లు పంచాయితీ పెట్టినా సమస్య పరిష్కారం కాలేదని, సోమవారం కూడా పొలాల వద్ద గొడవ జరిగిందని వీడియోలో పేర్కొన్నాడు. ఈ అవమానాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెబుతూ వీడియోను కుటుంబసభ్యులకు పంపించాడు. వారు పోలీసులకు విషయం తెలియజేయడంతో మద్దిలేటి ఎక్కడి నుంచి వీడియో పంపించాడో తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అవినీతిని అరికట్టాలి

ఆదోని రూరల్: హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ అవగాహన సదస్సు మంగళవారం ఆ సంఘం ఆదోని నియోజకవర్గ సభ్యులు గుమ్మల బాలస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ కర్నూలు జిల్లా చైర్మన్ శ్రీకాంత్ పాల్గొన్నారు. అవినీతి, అక్రమాలను రూపుమాపేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం హ్యూమన్ రైట్స్ టీమ్‌లో చేరే వారికి ఐడీ కార్డులు, జాయినింగ్ లెటర్ అందజేశారు.

కాడెద్దులకు తగ్గుతున్న ఆదరణ

- వ్యవసాయంలో పెరిగిన యాంత్రీకరణ
- ఖర్చు తక్కువ, సమయం ఆదా
- వీటివైపే మొగ్గు చూపుతున్న రైతన్నలు
- కనిపించని ఎద్దుల బండ్లు



ఎద్దులతో విత్తనం వేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఒకప్పుడు దుక్కిదున్నాలన్నా.. విత్తనం వేయాలన్నా.. పండించిన పంటను ఇంటికి చేరావేర్చాలన్నా కాడెద్దులు.. ఎడ్ల బండి కావాల్సిందే. వ్యవసాయం వీటి పాత్ర చాలా కీలకం. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు యాంత్రీకరణపై మొగ్గు చూపుతున్నారు. దీంతో ట్రాక్టర్లు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాల రాకతో ఇప్పుడు కాడెద్దుల వినియోగం తగ్గింది. పల్లెల్లో అడపదడపా తప్పా కాడెద్దులు కానరాని పరిస్థితి నెలకొంది. దీంతో వ్యవసాయంలో రైతన్నకు వెన్నుముకగా నిలిచిన ఎద్దులు, బండ్లు నేడు ఉనికిని కోల్పోతున్నాయి.

యంత్రాలపైనే రైతుల ఆసక్తి

వ్యవసాయం చేసే ప్రతి రైతు ఇంటి ముంగిట ఎడ్లు, బండి, పశువులు, పశువులపాక తదితర వాటితో ఆహ్లాదకర వాతావరణం ఉండేది. ఎద్దుల బండ్లు ఉన్న రైతులకు ఏడాదంతా పని దొరికేది. అటు రైతులు, ఇటు పశుపోషకుల కుటుంబాలు ఆనందంగా ఉండేవి. రాను రాను వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో ఎద్దుల బండ్లకు ఆదరణ తగ్గుతోంది. సాంకేతికత పెరిగిపోవడంతో అన్నదాతలు తక్కువ సమయంలోనే పనులు ముగించుకునేలా ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఇంటి ముందు ట్రాక్టర్లే దర్శనమిస్తున్నాయి. ఎడ్ల బండి ఉన్నా కూడా వ్యవసాయానికి పిలిచేవారే కరువయ్యారు. తక్కువ సమయంలో ఎక్కువ పనుల చేసేలా ఆధునిక యంత్రాలు రావడంతో అందరూ వాటి వైపే మొగ్గు చూపుతున్నారు.

గతంలో కాడెద్దులకు భలే గిరాకీ..

గతంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందు రైతులు ఎద్దులు, బండ్లు సిద్ధం చేసుకునేవారు. వాటికి మంచి గిరాకీ ఉండేది. సాగుకు అవసరమైన పనులు చేయించుకునేందుకు ముందుగానే రైతులకు అడ్వాన్స్ ఇచ్చేవారు. అలాగే కూలీలకు కూడా భలే గిరాకీ ఉండేది. ఇప్పుడు కూలీలతో కేవలం కలుపు తీయడం, మందులు చల్లడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. యంత్రాలతో పనులు చేయించడం వల్ల ఖర్చు తక్కువతోపాటు సమయం ఆదా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

సబ్సిడీపై యంత్రాలు..

ఒకప్పుడు ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహం లేకుండానే వ్యవసాయం చేసుకునేవారు. కానీ ప్రస్తుతం వ్యవసాయానికి ప్రభుత్వాలు వివిధ రకాలు పథకాలను అమలు చేస్తున్నాయి. సన్న, చిన్నకారు రైతులకు కూడా సాంకేతిక ఆధునిక యంత్రాలను సబ్సిడీపై అందజేస్తున్నారు. దీంతో ట్రాక్టర్లతోపాటు పరికరాలైన గొర్రులు, నాగేళ్లు, విత్తనం గొర్రులు, కోత మిషన్లు, రోటావేటర్ వంటి ఇస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వాయిదాల రూపంలో యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎద్దుల వ్యవసాయం రోజు రోజుకు కనుమరుగైపోతుంది.



ట్రాక్టరుతో పొలాన్ని దుక్కి దున్నుతున్న దృశ్యం

నాలుగైదు జతల కాడెద్దులు ఉండేవి



నాకు 30 ఎకరాలకుపైగా పొలం ఉంది. పదేళ్ల క్రితం నాలుగైదు కాడెద్దుల జతలు పెట్టి జీతగాళ్లతో వ్యవసాయం చేసేవాడిని. అయితే జీతాలు ఉండేవారు కరువయ్యారు. దీంతో పశువుల పోషణ భారంగా మారుతున్న సమయంలో యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చింది. దీంతో ఇప్పుడు ఉన్న పొలంలో ట్రాక్టర్లతోనే వ్యవసాయం చేయిస్తున్నా. ఈ విధంగా చేయడం వల్ల సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తగ్గింది.

– హనుమంతురెడ్డి, రైతు, అమకతాడు

గంటల్లో పని జరుగుతుంది



నాకు ఐదు ఎకరాల పొలం ఉంది. కానీ కాడెద్దులు లేవు. కాడెద్దుల ఉన్న వారిని పిలిపించుకుని పొలాల్లో వ్యవసాయ పనులు చేయించేవాడిని. ట్రాక్టర్లు వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో కాడెద్దులు పెట్టేవారు తక్కువయ్యారు. దీంతో అందరూ ట్రాక్టర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నాం. గతంలో కాడెద్దులతో ఏదైనా పని చేయాలంటే ఒక రోజంతా కష్టపడేవాళ్లం. ఇప్పుడు అదే పని ట్రాక్టర్ గంటల్లోనే చేస్తుంది. పొలం దున్నేప్పటి నుంచి ప్రతి పని ట్రాక్టర్ ద్వారానే చేయిస్తున్నాం.

– మూలింటి మాదన్న, రైతు, ఎస్‌హెచ్ ఎర్రగుడి

28న ఆలూరుకు డ్వామా పీడీ రాక

ఆలూరు: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డి ఈ నెల 28న ఆలూరులో పర్యటించనున్నట్లు ఏపీఓ శ్రీనివాసులు తెలిపారు. నీటి వసతి కలిగిన చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల సాగు చేపట్టే అంశంపై స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో రైతులు, ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఓ మంగళవారం తెలిపారు.అదే రోజున రైతులకు వివిధ రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తారన్నారు. టీసీ, ఈసీ, ఎఫ్ఏలు హాజరుకావాలని చెప్పారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తం



టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: ప్రజలు క్షయ (టీబీ) వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాబురాజు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆదోని పట్టణంలోని ఇందిరానగర్, శంకర్‌నగర్, హవన్నపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లలో క్షయ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. రెండు వారాలకు మించి విపరీతమైన దగ్గు, జలుబు ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష, టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలపాటు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులతో పాటు పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 నగదును అందించడం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది షేకున్‌భాను, మహేష్, బాబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తెరిపించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మద్దికెర : మండల కేంద్రమైన మద్దికెరలో 8 ఏళ్ల క్రితం విద్యార్థులు లేరనే సాకుతో మూసివేసిన ఎస్సీ హాస్టల్‌ను తెరిపించాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి అరుణ్‌కుమార్ డిమాండు చేశారు. మంగళవారం ఎంపీడీఓ అలివేలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్ మూసివేయడం వల్ల లక్షలాది రూపాయలు ప్రజాధనం వృథా అవుతోందని, భవనాలు శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయన్నారు. మద్దికెర మండలం నిత్యం కరువు కాటకాలతో అల్లాడుతుందని, హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు వలసలు పోతున్నారన్నారు. రాజకీయ నాయకులు, సంబంధిత అధికారులు స్పందించి హాస్టళ్లు తెరిపించి పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పాటునందించాలని కోరారు. కార్యక్రమంలో తిప్పన్న, వేణు, సాయికిరణ్, రాము, జస్వంత్, సాగర్ పాల్గొన్నారు.

రైలు కింద పడి యువతి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: ఆదోని–నగరూరు రైల్వేస్టేషన్ల మధ్య కి.మీ. నంబర్ 493/10 డౌన్ లైన్ రైల్వే ట్రాక్‌పై రైలు నంబర్ 22158 కింద పడి ఓ యువతి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. యువతి లైట్ రెడ్ కలర్ లెగ్గిన్, బ్లూ రంగు డాట్స్ బోర్డర్ గల గులాబీరంగు టాప్ ధరించి ఉందని, యువతి వయస్సు 30 సంవత్సరాలు ఉండొచ్చని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 98491 57634 నంబర్‌ను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసుకుని, యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపుతున్నట్లు చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వెల్దుర్తి పట్టణంలోని వార్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భారతిదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి భారతిదేవి సూచించారు. మంగళవారం వెల్దుర్తిలోని 12వార్డులో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీరు కలుషితమై ప్రజలు డయేరియా, వైరల్ ఫీవర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలన్నారు. కొద్ది రోజులు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. వ్యాధి సోకినప్పుడు సొంత వైద్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు రావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గదగ మఠంకు తరలిన బియ్యం లారీలు



హొళగుందలో బియ్యం బస్తాలతో బయలుదేరుతున్న లారీ వద్ద స్థానికులు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం గదగలోని పుట్టరాజు గవాయిస్వామి మఠానికి విరాళం ఇచ్చేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి సేకరించిన 250 క్వింటాళ్ల (500 బస్తాలు) బియ్యం, బ్యాళ్లు, ఇతర సరుకులను మంగళవారం స్థానిక యువకులు, పెద్దలు మఠం నిర్వాహకులకు అందజేశారు. మఠంలో చదివే అంధ విద్యార్థులతో పాటు అనాథలు, భక్తులకు నిత్యాన్నదానం, ఉత్సవాలు, ఇతర శుభకార్యాల సమయంలో అన్నదానం నిర్వహించేందుకు ఇక్కడి భక్తులు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను సేకరించి ఏటా మఠానికి పంపిస్తుంటారు. అదేవిధంగా బుధవారం నిర్వహించే గానయోగి పంచాక్షర గవాయి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత పుట్టరాజ గవాయి స్మరణోత్సవాలను పురస్కరించుకుని జరిగే ఉభయ గురువుల మహా రథోత్సవానికి కూడా ఉపయోగించుకోనున్నారు. అందులో భాగంగా గత కొద్ది రోజులుగా స్థానిక వీరశైవ లింగాయత్ యువకులు, ఇతరులు మండలంలోని ఆయా గ్రామాలలో తిరిగి భక్తుల నుంచి బియ్యం, ఇతర సరుకులను సేకరించారు. పోగుచేసిన 500 బస్తాల బియ్యం, బ్యాళ్లు ఇతర సరుకులను రెండు లారీల్లో గదగ మఠానికి చేర్చారు. తాము ఇచ్చిన విరాళం ద్వారా ఎంతో మంది అనాథ పిల్లలు, భక్తులకు ఆకలి తీరుతుందని గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో ఉన్న ఏపీ ఎన్జీవో భవన్‌లో మంగళవారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ గోపి తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఎస్ఐ కె.సి.తిరుపాల్, పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేయడం జరిగిందన్నారు. అక్కడున్న వారిని విచారించగా యాసిన్ అనే వ్యక్తి పేకాట ఆడిస్తున్నాడని చెప్పారన్నారు. పెద్ద మనుషుల సమక్షంలో సోదా చేసి వారి వద్ద నుంచి రూ.14,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

బాలికల పాఠశాలల్లో సీట్లు పెంచాలి



ఆస్పరిలో ఆర్ఐ భీమేష్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆస్పరి: మండలంలోని కస్తూర్బా, మోడల్ స్కూల్లో సీట్ల సంఖ్య పెంచాలని ఆస్పరి, బిణిగేరి, చిరుమాన్‌దొడ్డి, పుటలకమర్రి గ్రామాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ఆస్పరి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి ఆర్ఐ భీమేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆలూరు నియోజకవర్గ కార్యదర్శి మునిస్వామి మాట్లాడుతూ.. ఆస్పరి మండలం వెనుకబడిన ప్రాంతమైనందున చాలా మంది నిరుపేద తల్లిదండ్రులు బాలికలను చదివించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కస్తూర్బా, మోడల్ స్కూల్లో ఒక్కో తరగతికి కేవలం 40 మందికి మాత్రమే సీట్లు దొరకడంతో మిగతా వారు తల్లిదండ్రుల వెంట వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటున్నారని వాపోయారు. బాలికలు చదువుకునే విధంగా కస్తూర్బా, మోడల్ స్కూళ్లలో సీట్ల సంఖ్య పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించండి



ఆరోగ్య సిబ్బందికి కరపత్రాలను అందిస్తున్న డాక్టర్ రేష్మ

ఆలూరు రూరల్: వర్షాకాలంలో ప్రబలే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి తదితర విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రేష్మ వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. ఆమె మంగళవారం సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పులు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని చెప్పారు. జర్వం లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. డాక్టర్ రవి, ఎంపీహెచ్ఈఓ అంద్రూస్, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో పైర్లకు మేలు



వర్మీకంపోస్ట్, లిక్విడ్ ట్రైకోడెర్మాతో కలుపుకునే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

పెద్దకడబూరు: పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు, నాణ్యమైన ఉత్పత్తులు పండించవచ్చని వ్యవసాయ సహాయకులు మహేష్, ఉద్యాన సహాయకులు నాయక్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ కార్యకర్త కరుణప్ప సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో మంగళవారం వాతావరణ అనుకూల వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఆ గ్రామ రైతు ఉప్పర గోవిందు పొలంలో పత్తి విత్తనాలు నాటుకునేటప్పుడు బోదల్లో వర్మీ కంపోస్ట్ లిక్విడ్ ట్రైకోడెర్మాతో కలిపి వేసుకోవడం ద్వారా మొలక దశ నుంచి భూమి నుంచి సోకే తెగుళ్లను నివారించవచ్చునని సూచిస్తూ మిశ్రమం కలుపుకునే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



నిట్రవట్టిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న డీటీఎఫ్ నాయకులు

హాలహర్వి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పొంగలి రమేష్, మండలశాఖ అధ్యక్షుడు మస్తాన్‌వలి, గౌరవాధ్యక్షుడు మజహర్‌బాషా, ఉపాధ్యక్షురాలు గీత, ఎ.కె.మారెప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని 8 పాఠశాలల్లో ఒకే ఒక ఉపాధ్యాయుడితో తరగతులు కొనసాగుతున్నాయన్నారు. నాలుగు పాఠశాలల్లో అసలు ఉపాధ్యాయులే లేరన్నారు. డీఎస్సీ నియామకాలు చేపట్టే వరకు విద్యా వలంటీర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. చిన్నాభిన్నమైన విద్యారంగాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలలోనే 3, 4, 5 తరగతులను కొనసాగించాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని 1:40కి తగ్గించాలన్నారు. కొత్త వేతన సవరణ వచ్చే వరకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా జయతీర్థుల మహితోత్సవం



అశేష జనావాహిని మధ్య జయతీర్థుల రథోత్సవం



వేడుకను తిలకిస్తున్న భక్తులు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల మహితోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో మహితోత్సవం వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. కర్ణాటకలోని నవ బృందావన క్షేత్రంలో బృందావనస్థులైన పద్మనాభతీర్థుల మూల బృందావనానికి జయతీర్థులు శ్రీమన్యాయసుధా గ్రంథాన్ని సమర్పించిన దినాన్ని పురస్కరించుకుని జయతీర్థుల మహితోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం జయతీర్థుల చిత్రపటానికి ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు రథంపై జయతీర్థుల చిత్రపటాన్ని ఉంచి అంగరంగ వైభవంగా ఊరేగించారు. శ్రీమఠం ప్రాంగణంలో రథోత్సవం కనుల పండువగా సాగింది. అనంతరం ఊంజల మండపం వేదికపై పీఠాధిపతి ప్రవచనాలు గావించారు. జయతీర్థుల మహితోత్సవం విశిష్టతను భక్తులకు వివరించారు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్త

- ఆదమరిచారో ఆస్పత్రి పాలు గాక తప్పదు
- వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

దేవనకొండ: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు కావొస్తోంది. ఇప్పటికే రైతులు పత్తి, వేరుశనగ, ఆముదం, కంది, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగుచేశారు. పంటలకు ఆశించే చీడపీడలు, బ్యాక్టీరియా, వైరస్‌ల కట్టడికి రైతులు పురుగు మందులను పిచికారీ చేస్తుంటారు. అయితే పిచికారీ సమయంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని, పురుగు మందులను ఎలా వాడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విశయాలపై దేవనకొండ మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు పలు సూచనలు తెలియజేశారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

→ పురుగు మందుల పిచికారీకి అవసరాన్ని బట్టి తగిన స్ప్రేయర్, నాజిల్స్ ఎన్నుకోవాలి. పురుగు మందులు, తెగుళ్ల మందుల పిచికారీకి ఫ్లాట్ ఫాన్ నాజిల్ లేదా హాలో కోన్ నాజిల్ వాడవచ్చు.

→ ద్రావణం తయారీకి మంచినీటినే వాడాలి. సిఫార్సు చేసిన మోతాదు మేరకే పంటపై పిచికారీ చేయాలి. తక్కువ మోతాదులో వాడితే మందు పనిచేయదు. ఎక్కువ మోతాదులో వాడితే పురుగు లేదా తెగులు త్వరగా రోగనిరోధక శక్తిని పెంచుకుంటుంది.

→ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, గాలివేగం ఎక్కువగా ఉన్నప్పుడు, మంచు కమ్మినప్పుడు, వర్షం కురిసే ముందు పురుగు మందులు పిచికారీ చేయరాదు.

→ కనీసం ఆరు గంటల వరకు వర్షం కురవదని భావిస్తేనే మందులు పిచికారీ చేపట్టాలి.

→ మందు ద్రావణాన్ని జలాశయాలు, నీరు నిల్వ ఉంచే ప్రదేశాల దగ్గర కలపకూడదు.

ఈ సూచనలు పాటించాలి

→ ద్రావణాన్ని ఒకేసారి తయారు చేసుకోవాలి. పంపులో నింపే ముందే కలుపుకొని వాడుకోవాలి.

→ మందు మోతాదు కొలవడానికి డబ్బా మూతలు కాకుండా మందు డబ్బాతో వచ్చిన కొలమానికనే వాడాలి.

→ పిచికారీ సమయంలో రక్షక దుస్తులు, చేతికి గ్లౌజులు, ముక్కుకు మాస్క్, కళ్లకు రక్షణ అద్దాలు విధిగా ధరించాలి.

→ మందును చేత్తో కలపరాదు. ఏదైనా కర్రను ఉపయోగించాలి.

→ పురుగు మందు పిచికారీ సమయంలో నీరు తాగడం, ఆహారం తినడం, గుట్కా నమలడం, పొగ తాగడం చేయరాదు.

→ ఆహార పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు, పశుగ్రాస పంటలపై పురుగు మందులు పిచికారీ చేస్తే సుమారు 7 నుంచి 10 రోజుల తర్వాతే వాటిని కోసి మార్కెట్‌కు పంపాలి.

→ వాడేసిన మందు డబ్బాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా గుంత తవ్వి పూడ్చి పెట్టాలి.